# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# మహా ప్రసాదం

**తిరుమల** శ్రీవారి లడ్డూ ప్రసాదం కొన్నాళ్లుగా వార్తల్లో నలుగుతున్నది. కల్తీ నెయ్యికి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపాయి. అందులో కలవగూడని పదార్థాలు కలిశాయన్నట్టుగా ఆయన మాట్లాడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వామివారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. లడ్డూ నాణ్యతపై చంద్రబాబు కావాలనే అనుమానాలు కలిగేలా చేశారు. విపక్ష పార్టీని ఇరకాటంలో పెట్టాలనే ఆలోచన బహుశా అందుకు కారణమై ఉంటుంది. మొత్తంగా ఆలయాల నిర్వహణపైనే ఈ సందర్భంగా మౌలిక చర్చ మొదలు కావడం పరాకాష్ఠ. ఈ హడావుడిలో కొందరు ఒకడుగు ముందుకువేసి శుద్ధి కార్యక్రమాల పేరిట హడావుడి చేశారు. అటు కేంద్రంలోని బీజేపీ నాయకత్వం కూడా వివాదంలో దూరిపోయి హంగామా చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఆధ్యాత్మికం కన్నా రాజకీయాల పాలే ఎక్కువని ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా లడ్డూ కల్తీపై ఆరోపణలు చేయడాన్ని ఆక్షేపించింది. అసంపూర్తి సమాచారంతో అనుమానాలు రేకెత్తించేలా మాట్లాడి పవిత్రమైన ప్రసాదాన్ని వివాదాల్లోకి లాగడం దురదృష్టకరం. ఓ వైపు తన ఆదేశాల మేరకే దర్యాప్తు జరుగుతుండగా సీఎం స్థాయి వ్యక్తి మీడియా ముందు అదే అంశం గురించి మాట్లాడాల్సిన అవసరం ఏమిటని సుప్రీంకోర్టు నిలదీయడం గమనార్హం. దేవుని చుట్టూ రాజకీయాలు అల్లుకోవడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో లడ్డూకు సంబంధించి స్పష్టత రావడంతో అశేష భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

*దేవుడిని, మతాన్ని రాజకీయాల కోసం వాడుకోవడం భక్తుల దృష్టిలో అపచారం మాత్రమే కాదు, ప్రజాస్వామ్యంలో అపమార్గం కూడా. మత విశ్వాసాలను రెచ్చగొట్టి ఓట్లు పిండుకునే ధోరణి ఇటీవలి కాలంలో పెచ్చరిల్లింది. తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ధోరణిని అనేక సందర్భాల్లో ఎండగట్టిన సంగతి తెలిసిందే. ఆయన భక్తి విశ్వాసాలు నిండుగా, మెండుగా ఉన్న నిష్ఠాగరిష్టుడు. పూజాదికాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. యజ్ఞయాగాదుల్లో పాల్గొంటారు. యాదాద్రికి పునర్ వైభవ ప్రాప్తికి కర్త, కర్మ, క్రియ కేసీఆరే. కొండగట్టు బృహత్తరమైన అభివృద్ధికి నాంది ప్రస్తావన జరిపారు. ఇంకా అనేక ఇతర ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. ధార్మిక కార్యాలకు ఎప్పుడూ ముందుంటారు. కానీ, ఆయన ఏనాడూ అందుకు సంబంధించిన ప్రచారాన్ని లేశమాత్రం కూడా చేసుకోలేదు. మతాన్ని రాజకీయాలకు వాడుకోలేదు. అభివృద్ధి, సంక్షేమం ఎజెండాగా ముందుకు సాగారు తప్ప భావావేశాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే పనికి ఎన్నడూ పూనుకోలేదు. పరిణత రాజనీతిజ్ఞునిగా దేశానికే ఆదర్శంగా నిలిచారు. గంగ ఒడ్డున చిన్న ఘాట్ కట్టి, దానికి ఇబ్బడి ముబ్బడిగా ప్రచారం చేసుకుంటున్న ఈ కాలంలో అంత ప్రభవంగా యాదగిరి గుట్ట కృష్ణశిలా నిర్మాణాన్ని చేపట్టి కూడా ఎటువంటి ప్రచారం చేసుకోని వ్యక్తి కేసీఆర్. భక్తి వ్యక్తిగతం. దాన్ని రాజకీయం చేయాలని చూస్తే దేవుడు ఊరుకుంటాడా? చంద్రబాబు విషయంలో జరిగింది ఇదే!*

# గాంధీ స్ఫూర్తికి గ్రహణం..కాంగ్రెస్ హింస రచన




దేశపతి శ్రీనివాస్
ఎమ్మెల్సీ

జి.దేవీప్రసాద్
ఉద్యోగ సంఘాల నాయకులు

> పది నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రజా పాలన మేకప్ పూర్తిగా కరిగిపోయింది. మేక తోలు కప్పుకున్న గుంట నక్కగా ప్రజల ముందు నగ్నంగా నిలిచింది. సత్యం, అహింస ఆయుధాలుగా స్వాతంత్ర్య సమరాన్ని నడిపించిన గాంధీకి వారసులమని రేవంత్‌రెడ్డితో సహా, కాంగ్రెస్ నాయకులు గప్పాలు కొడుతూ గొప్పలు చెప్తుంటారు. సారాంశంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ పరమహంస కాదు, పరమహింస అని చరిత్ర నిరూపిస్తూ వస్తున్నది.

ఎన్నికలకు ముందు ప్రజాస్వామ్యమని, పౌరహక్కులని, భావప్రకటనా స్వేచ్ఛని, ఆంక్షలు లేని పాలనని, కంచెలు లేని భవనాలని, ఆరు గ్యారెంటీలకు తోడుగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ మా ఏడో గ్యారెంటీ అని తెగ ఊదరగొట్టారు. ప్రజాస్వామ్య పాలనకు తాము పూచీగా నిలుస్తామని కాంగ్రెస్ పక్షాన నిలిచిన సోకాల్డ్ సివిల్ సొసైటీ మేధావులు సైతం హామీ ఇచ్చారు. ప్రశ్నించే గొంతుకలకు స్వేచ్ఛ ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లినట్లని గంభీరమైన ఉపన్యాసాలు ఇచ్చారు. కాంగ్రెస్ తోవ తప్పితే దాన్ని తోవలో పెట్టే బాధ్యత తమదని వాగ్దానం చేశారు. పది నెలల పరిపాలన తర్వాత కాంగ్రెస్ ఒక బుల్డోజర్‌గా అవతరించింది. బీజేపీ బ్రాండ్ బుల్డోజర్‌ను సొంతం చేసుకున్న రేవంత్ పేద ప్రజల ఇండ్లు కూల్చే పనిని కసిగా కొనసాగిస్తున్నాడు. మొహబ్బత్ కీ దుకాన్ తెరువలేదు గానీ పేద, మధ్య తరగతి ప్రజల మకాన్‌కే ఎసరు పెట్టాడు. మూసీలో ఇప్పుడు పారుతున్నది మురుగు నీరు కాదు, పేద ప్రజల గుండె మంటలతో మరిగిన కన్నీరు పారుతున్నది. ఆదుకునే దిక్కు కోసం హైడ్రా బాధితులు, మూసీ నిర్వాసితులు తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు. తమ గూడు చెదిరిన గోడు వెళ్లబోసుకున్నారు.

చట్టబద్ధంగా నడుచుకోవాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి చట్టాన్ని చట్టుబండలు చేస్తుంటే, పేద, మధ్య తరగతి ప్రజల బతుకులను నడి రోడ్డున పడేస్తుంటే ప్రధాన ప్రతిపక్షం చూస్తూ ఉండలేదు కదా. ప్రజలిచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు కేటీఆర్, హరీశ్‌లు నిర్వాసితులకు అండగా నిలిచారు. ఈ పరిణామం బాధితులకు కొండంత ధైర్యాన్నిచ్చింది. గులాబీ జెండా అండగా రావడంతో బాధితుల పిడికిళ్లు మరింత బలంగా బిగుసుకున్నాయి. కాంగ్రెస్ దాష్టీకానికి వ్యతిరేకంగా వారి గళాలు మరింత పదునుగా విచ్చుకున్నాయి. హైడ్రాకు జై కొట్టిన కాంగ్రెస్ అనుకూల మీడియా సైతం ప్రజల్లో తిరుగుబాటు ప్రారంభమైందని రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి హెచ్చరికలు జారీచేసి అప్రమత్తం చేయాల్సిన అగత్యం ఏర్పడింది.

> **సహజంగానే ఈ పరిణామం రేవంత్ రెడ్డిలో ఉక్రోషాన్ని పెంచింది. రేవంత్ రెడ్డికి ఉక్రోషం పెరిగినప్పుడల్లా ప్రతిపక్షం మీద దాడులు చేయించడం పరిపాటిగా మారింది. దానికి కొనసాగింపే నిన్న కేటీఆర్ మీద జరిగిన అప్రజాస్వామిక, దుర్మార్గ దాడి.**

పత్రికా సమావేశాల్లో కేటీఆర్, హరీశ్‌రావు వేస్తున్న పదునైన ప్రశ్నలు కాంగ్రెస్ నేతల గుండెల్లో బాకుల్లా దిగుతున్నాయి. మూసీ సుందరీకరణ అనే అందమైన పేరుతో ప్రజాధనాన్ని కొల్లగొట్టే కాంగ్రెస్ దురాలోచనకు హరీశ్‌రావు, కేటీఆర్ ఇద్దరూ అడ్డంకిగా మారారు. ఈ క్రమంలో వారు బాధితులను ప్రత్యక్షంగా కలుసుకొని, పిడికిలి బిగిస్తే కాంగ్రెస్ పునాదుల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. ఆర్థిక వనరులు అందించే అవినీతి పథకానికి ద్వారాలు మూసుకుపోతున్నాయి. దీంతో రేవంత్‌రెడ్డికి కోపం నషాళానికంటింది. ఇంకేముంది.. మరో భౌతికదాడికి కనుసైగ చేశాడు. రౌడీ మూకలు కేటీఆర్ మీద దాడికి తెగపడ్డాయి. సాకులు వేరే చూపించవచ్చు. ఆర్థిక దోపిడికి వచ్చిన ఆటంకమే అసలు కారణం.

మొన్న వరదలు వచ్చినప్పుడు ప్రజలను ఆదుకోవడంలో కాంగ్రెస్ దారుణంగా విఫలమైంది. ఓట్లు వేసిన పాపానికి మాకిదా శిక్ష అని బాధితులు కోపాన్ని వెళ్లగక్కారు. సీఎం పర్యటన నిండా ఛీత్కారాలే ఎదురయ్యాయి. అదే సమయంలో పరామర్శించడానికి వచ్చిన హరీశ్‌ను ప్రజలు గుండెకు హత్తుకున్నారు. తమ గుండె కోతను వినిపించారు. తమను ఆదుకోవడంలో నేరపూరిత నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిన కాంగ్రెస్ మీద నిప్పులు కక్కారు. ప్రజల నుంచి తిరుగుబాటు వేడి, ప్రతిపక్ష బీఆర్ఎస్ ప్రశ్నల వాడి రెండింటికీ జవాబు చెప్పలేక రేవంత్ అప్పుడు కూడా దాడినే ఎన్నుకున్నాడు. హరీశ్‌రావు కారు మీద రాళ్లు వేయించాడు.

> **బానెట్ మీద బండలు వేయించాడు. కాంగ్రెస్ మూక దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త కాలు చితికిపోయిన దుస్థితి. రుణమాఫీ నిజానిజాలు తేల్చడానికి ముఖ్యమంత్రి సొంత ఊరు కొండారెడ్డి పల్లికి పోయిన మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ అల్లరి మూకలు అసభ్యకరంగా దాడి చేశాయి.**


కొండా సురేఖ మెడలో రఘునందర్ రావు నూలు దండ వేస్తున్న ఫొటోపై సోషల్ మీడియాలో అవాంఛనీయమైన వ్యాఖ్య చేసిన ఘటనను బీఆర్ఎస్ నాయకత్వం ఖండించింది. ఇది నిజంగా గర్హనీయం. రాజకీయాల్లో జెండర్ సెన్సిటివిటీ లోపించడం శోచనీయం. ఇద్దరు నాయకుల సన్మాన సంఘటనపై వికృతంగా వ్యాఖ్యలు చేయడం మానసిక వైకల్యమే. ఎవరో సరైన చైతన్యం లేని ఒక వ్యక్తి ఆ తప్పుడు పనికి పాల్పడ్డాడు. దానికి చింతిస్తున్నామని హరీశ్‌రావు బహిరంగంగా తన ఆవేదన వ్యక్తం చేశాడు. సురేఖ ఆవేదన పట్ల ఒక సోదరుడిగా సానుభూతిగా స్పందించాడు. ఇలాంటి వికృత ధోరణులను బీఆర్ఎస్ అంగీకరించదు. సభ్యత ఉన్న వ్యక్తులెవరైనా దీన్ని గర్హిస్తారు. కేటీఆర్ మీద కాంగ్రెస్ దాడికి తెగబడటం వెనుక కారణం మాత్రం మూసీ నిర్వాసితుల పట్ల కేటీఆర్ తీసుకున్న కచ్చితమైన వైఖరే. ఈ దాడి ద్వారా హైడ్రా, మూసీ నిర్వాసితుల కోసం గట్టిగా నిలబడే నాయకుల మనో నిబ్బరాన్ని దెబ్బకొట్టాలనేది రేవంత్ అసలు పన్నాగం. అంతిమంగా ప్రజా పాలన, ప్రజా పీడనగా మారి ప్రశ్నించే వారి మీద భౌతికదాడులు జరిపే విష సంస్కృతికి కాంగ్రెస్ తెరలేపింది. బీఆర్ఎస్ పరిపాలనలో బండి సంజయ్ నుంచి రేవంత్‌రెడ్డి దాకా 'పాదాల మీద నడిచే యాత్ర'లు ఎన్నో చేశారు. బీఆర్ఎస్ ఏనాడూ దాడులు చేసే ప్రయత్నం చేయలేదు. దానివల్ల ప్రతిపక్షాలు స్వేచ్ఛగా తమ కార్యక్రమాలు జరుపుకొన్నాయి.

ఇవ్వాళ ప్రశ్నించేవారి మీద కాంగ్రెస్ మూక దాడులకు పాల్పడుతున్నది. ఇదిట్లనే కొనసాగితే తెలంగాణలో ఫ్యాక్షనిస్టు తరహా వాతావరణం వ్యాపించే ప్రమాదం ఉన్నది. ప్రశ్నలను రాజకీయంగా ఎదుర్కోవాలి. సంయమనంతో సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. కానీ, అందుకు భిన్నంగా ప్రతిదానికి ఒక ఘర్షణ వాతావరణాన్ని సృష్టించే ఎత్తుగడను కాంగ్రెస్ అనుసరిస్తున్నది. ఇది తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు తెచ్చిన మార్పు. ఆరు గ్యారెంటీలను తీర్చలేని అసహాయత ప్రజల మీద అణచివేతగా పరిణమిస్తున్నది. కుదిరితే డైవర్షన్, కుదరనప్పుడు మూక దాడి అనే పద్ధతిని కాంగ్రెస్ అనుసరిస్తున్నది. ఈ పద్ధతి చాలా తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది.

> **సమైక్య పాలనలో ప్రజా వ్యవస్థలు దారుణంగా విఫలం కావడం వల్ల హింసాయుత ప్రతిఘటనలు చెలరేగాయి. హింస, ప్రతిహింసలతో తెలంగాణ గ్రామాలు అట్టుడికిపోయాయి. ప్రజలు నైరాశ్యంలోకి మళ్లుతున్న సందర్భంలో అహింసను ఎంచుకున్న తెలంగాణ పోరాటం ప్రజలను ఆకర్షించింది. ప్రజా వ్యవస్థలపై విశ్వాసాన్ని పాదుకొల్పే ప్రయత్నం చేసింది.**

ఎన్నికలను, అసెంబ్లీని, పార్లమెంట్‌ను ఉపయోగించుకుంటూ ఉద్యమాన్ని నడిపింది. గాంధేయవాదంతో అహింసా మార్గంలో శాంతియుత పంథాలో కూడా ఫలితాలు సాధించవచ్చని తెలంగాణ ఉద్యమం నిరూపించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యవస్థలను ప్రశ్నార్థకం చేస్తూ ప్రధాన ప్రతిపక్షం మీదనే హింసాయుత దాడులకు తెగబడితే తెలంగాణ తిరిగి సంక్షోభంలోకి పోతుంది. హింస, ప్రతి హింసల వాతావరణం తిరిగి చుట్టు ముడుతుంది. దానికి రేవంత్ సర్కారే బాధ్యత వహించాల్సి వస్తుంది. అవాంఛనీయ దుష్పరిణామాలు తలెత్తకముందే తెలంగాణ సమాజం మేల్కొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి. గాంధీ జయంతి స్ఫూర్తితో సకలజనులు అందుకు పూనుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

> **గాంధేయవాదంతో అహింసా మార్గంలో శాంతియుత పంథాలో కూడా ఫలితాలు సాధించవచ్చని తెలంగాణ ఉద్యమం నిరూపించింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యవస్థలను ప్రశ్నార్థకం చేస్తూ ప్రధాన ప్రతిపక్షం మీదనే హింసాయుత దాడులకు తెగబడితే తెలంగాణ తిరిగి సంక్షోభంలోకి పోతుంది.**




# మరో తుర్క్‌మెన్ గేట్‌గా హైడ్రాబాద్!



డాక్టర్ అయాచితం శ్రీధర్
98498 93238

**మిన్ను విరిగి మీద పడ్డట్టు హైడ్రా డైనోజార్లు అమాయక పేద ప్రజల ఇళ్లపై విరుచుకపడ్డాయి. సినిమాల్లో గ్రాఫిక్‌లను తలదన్నేలా పేద మధ్యతరగతి గుడిసెలు, పాకలు, ఇండ్లు కండ్ల ముందే నేలమట్టమయ్యాయి. బుచ్చమ్మ బుగులుతో ఉరి వేసుకుని భూమిలో కలిసిపోయింది. గుండె చెదిరి, గూడు చెదిరి వీధుల పాలైన కష్టజీవుల కన్నీటి సన్నివేశాలకు, ఎప్పుడు ఏ ఇంటి మీద పిడుగు పడుతుందో తెలియని భీతావహ వాతావరణానికి మూగ సాక్షిగా నిలిచింది మన మహా నగరం హైదరాబాద్. కాదు కాదు, 'హైడ్రా' బాద్. ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ బాధితులు తెలంగాణ భవన్ బాట పట్టడం, వారి తరపున బీఆర్ఎస్ ఉద్యమాన్ని చేపట్టడం, సమాజం యావత్తు ఇది అన్యాయమని ఎలుగెత్తడంతో ప్రభుత్వం నాలుక కరుచుకున్నది.**



మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం విసిరిన హైడ్రా పాచిక పారింది. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక ప్రజలు సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక సతమతమైన దుస్థితి నుంచి హైడ్రా పుణ్యమాని కొంత సేదతీర గలిగింది. అతివృష్టి, వరదలు, విష జ్వరాలు, పంట నష్టం, అకాల మరణాల వంటి ప్రధాన తక్షణ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడంలో కొంతమేర సఫలమైంది. చెరువులు, నాలాల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు వంటి అంశాల్లో ప్రభుత్వాలు చర్యలు చేపడితే అందుకు ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయలోపం, యంత్రాంగం అలసత్వం, అవినీతి అధికారుల ధనాపేక్ష వల్ల ఏర్పడిన ఈ సమస్య సామాన్య ప్రజల పాలిట శాపంగా మారకూడదు. స్థలం రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులు, ఇంటి నెంబర్లు, ఆస్తి పన్ను, కరెంటు, మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, చెత్త సేకరణ ఇవన్నీ ప్రభుత్వ విభాగాలే సమకూర్చి నిర్వహిస్తున్న క్రమంలో ఆ ఇండ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలను రాత్రికిరాత్రి ఆక్రమణలంటూ వీధుల పాలు చేయడం అభ్యంతరకరం, అమానుషం. నిర్వాసితులు, బాధితులు ప్రశ్నిస్తున్నది అదే. పైగా ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. తక్షణమే పరిష్కారమయ్యే సమస్య కాదు. ఒక దీర్ఘకాలిక ప్రణాళిక చేపట్టి, బాధితులకు తగినంత సమయం ఇచ్చి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించి, విడతల వారీగా హైడ్రా కార్యక్రమం కొనసాగితే బాగుండేది. కానీ, అలా జరగలేదు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో సంపన్నులు రాజభవనాలు, ఉద్యాన, విలాస మందిరాలను నిర్మించుకున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ భూములనే ప్లాట్లు చేసి, ఇండ్లు కట్టి అమాయకులైన పేద మధ్యతరగతి ప్రజలకు అంటగట్టారు. దీంతో ఆ ప్రజలు దారుణంగా మోసపోయారు. దీనికి ముగింపు పలకాలనుకున్న ప్రభుత్వం ముందుగా తన ప్రతాపాన్ని పెద్ద తలకాయల మీద చూపెడితే సబబుగా ఉ ండేది. కూల్చివేతల వల్ల వారికి పెద్దగా నష్టం కూడా జరిగేది కాదు. పేద, మధ్య తరగతి ప్రజల పరిస్థితి అలా కాదు. వారికి అది జీవన్మరణ సమస్య. ప్రభు త్వం ఈ వాస్తవాన్ని విస్మరించి సామాన్య ప్రజల ఆవాసాలను వరుసగా సెలవు రోజుల్లో సైతం రాత్రిపగలు తేడా లేకుండా గంటల్లోనే కూల్చివేత ప్రక్రియ పూర్తిచేయడం ప్రజా ప్రభుత్వం అని చెప్పుకొంటున్నవారు చేయదగిన పనేనా? అని బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. శాపనార్థాలు పెట్టారు. మంత్రులు తమ ప్రజా దర్బారులనుహైడ్రా కూల్చివేత ప్రాంతా ల్లో ముందస్తుగా నిర్వహించారా? ప్రజల గోడు ఏమి టో కనీసం విన్నారా?వారిని ప్రజాభవన్‌కు రమ్మన్నారా? సంబంధిత ప్రజాప్రతినిధులతో చర్చించారా? అని బాధితులు నిలదీస్తే అధికార పార్టీ నేతలు నీళ్లు నమిలారు. నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో ఉన్నప్పటికీ ప్రభుత్వానికి సంబంధించిన అన్నిరకాల అనుమతులు సౌకర్యాల కేటాయింపులు ఉండి ఉంటే వాటిని అలా ఉంచి సావధానంగా నిర్ణయం తీసుకుంటే బాగుండేది. కూలిపోయిన ఇండ్లకు బ్యాంకు కిస్తీలు కట్టే దురవస్థ దాపురించేది కాదు. మిగిలిన పేదలందరికీ డబుల్ బెడ్‌రూంలు కేటాయించిన తర్వాత కూల్చివేత కొనసాగిస్తే ఇంత ప్రతిఘటన వచ్చేదే కాదు.

> **ఇప్పుడు వారికి కేటాయిస్తున్న డబుల్ బెడ్‌రూములు కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కట్టినవే. ఈ 10 నెలల్లో ప్రభుత్వం ఆ దిశగా డబుల్ బెడ్‌రూమ్‌లకు కనీసం ముగ్గు పోయలేదు. తట్టెడు మట్టి తీయలేదు. అలాంటప్పుడు ప్రభుత్వ చర్య వల్ల నిర్వాసితులయ్యే లక్షలాది మంది పేదల గోడు వినేదెవరు? వారందరికీ ఇండ్లు కేటాయించేదెప్పుడు?**

అంగ బలంతో, అర్థ బలంతో ప్రభుత్వాన్ని దారికి తెచ్చుకునే స్థోమత గాని, న్యాయస్థానాలను ఆశ్రయించే తాహతు కానీ సామాన్య ప్రజలకు ఉండవు కదా. ప్రజల నిస్సహాయత, దీనావస్థతో పరాచికాలాడటం ప్రభుత్వానికి క్షేమం కాదు. ఇప్పటికే కూల్చివేతలతో నష్టపోయిన కుటుంబాలకు సమంజసమైన పరిహారం కాలయాపన చేయకుండా చెల్లించడం ప్రభుత్వం కనీస బాధ్యత.

హైదరాబాద్‌కే కాదు, దేశ రాజధాని ఢిల్లీ సహా కలకత్తా, చెన్నై వంటి మహా నగరాలకు నదులు, నాలాల సమస్య ఉన్నది. ఇతరత్రా పెద్ద పెద్ద నగరాలు సర్వసాధారణంగా నదీ తీరాల్లోనే ఉన్నాయి. ఆక్రమణలు తొలగించమని ఆయా ప్రాంతాల న్యాయస్థానాలు ఆదేశించాయి. కానీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ప్రభుత్వం లాగా లేడికి లేచిందే పరుగు అన్నట్టు వ్యవహరించలేదు. సావధానంగానే సమస్యను ఉభయతారకంగా పరిష్కరించుకుంటూ పోతున్నాయి. యూపీలో తప్ప ఏ ఇతర రాష్ట్రాల్లో బుల్డోజర్ భూతాలను ఆయా ప్రభుత్వాలు సామాన్య ప్రజల ఇండ్ల మీదికి తోలడం లేదు. నదులు, నాలాలు పొంగడానికి, నీళ్లు రోడ్ల మీదికి ఇండ్లలోకి రావడానికి, కేవలం పేదోళ్ల ఆక్రమణలు మాత్రమే కారణమని అభాండాలు వేసి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరి కాదు. అభ్యంతరకర నిర్మాణాలను కూల్చుకుంటూ పోతే సగం హైదరాబాద్ ఉండదు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న సోమాజిగూడ, బేగంపేట్, రాణిగంజ్ ప్రాంతాల స్వరూపమే మారిపోతుంది. ప్రభుత్వ భవనాల ఉనికి సైతం ప్రశ్నార్థకమవుతుంది. వీటితోపాటు నగరమంతా నరాల లాగా అల్లుకుపోయిన నాలాలను వ్యవస్థీకరించడానికి, నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి. అందుకు ప్రభుత్వం వేసిన ప్రణాళికలెన్ని? కేటాయించిన నిధులు ఎన్ని?

1908లో మూసీనది ఉప్పొంగి బేగంబజార్, చార్మినార్, గౌలిగూడ, చాదర్‌ఘాట్, అంబర్‌పేట్, మలక్‌పేట్ సహా సగం హైదరాబాద్ మునిగిపోయినప్పుడు నాటి నిజాం ప్రభువు ఆయా ప్రాంతాల ప్రజల ఇండ్లను కూల్చివేయలేదు. దీర్ఘదృష్టితో ఆలోచించి హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నిర్మించాడు. మూసీనదికి ఇరువైపులా రక్షణ గోడలు కట్టించాడు. వందేండ్ల అవసరాలు తీర్చగలిగే డ్రైనేజీ, వంతెనలు నిర్మించాడు. పరిష్కారమంటే అది. సముద్ర మట్టానికి దిగువగా ఉన్న నెదర్లాండ్స్ సాంకేతిక నిర్మాణ పరిజ్ఞానంతో ముంపు సమస్యను అధిగమించింది. ఇటలీలోని వెనిస్, కేరళలోని అలెప్పీ పట్టణాలు నీళ్లలోనే నిర్మాణమయ్యాయి. ప్రభుత్వం తలచుకుంటే నిర్వాసితులకు న్యాయం చేస్తూనే మూసీ నదిని, చెరువులను, నాలాలను చక్కదిద్దడం అసాధ్యమేమీ కాదు. వాటిని రక్షించడం అంటే తత్సంబంధిత భూభాగాన్ని రక్షించడం ఒక్కటే అనుకుంటోందేమో ప్రభుత్వం. ప్రమాదకరమైన కాలుష్యం గురించి ఆలోచించడం లేదు. బహుళ అంతస్థుల భవనాలకు, బాహుబలి వ్యాపార కేంద్రాలకు అనుమతివ్వడానికి ముందే దీర్ఘకాలిక అవసరాలు తీర్చగలిగే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేస్తే ఈ దుస్థితి దాపురించదు కదా. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం నగర వైశాల్యంలో 30 శాతం రోడ్లు ఉండాలి. అందులో సగం కూడా లేవు. అందుకే ఏటా హైదరాబాద్‌లో వర్ష బీభత్సం.

> **ప్రజల దైనందిన సమస్యలు పరిష్కరించకుండా, ఇచ్చిన హామీలు అమలుచేయకుండా వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికి ప్రభుత్వం సరికొత్త ఇంద్రజాల ప్రదర్శనకు తెర లేపిందన్నది స్పష్టం. జనావాసాల తొలగింపు వల్ల నిర్వాసితులయ్యే కుటుంబాలెన్ని? వారి కోసం ఎన్ని ఇండ్లు కట్టాలి? ఎంత ఖర్చవుతుంది?నిధులెట్లా? ఎప్పటిలోగా ఇండ్లు పూర్తవుతాయి వంటి అంశాలు సాకారమైన తర్వాతే, బాధితులకు నచ్చచెప్పి ఒప్పించిన తర్వాతే కూల్చివేత ప్రక్రియ ప్రారంభించి ఉంటే ప్రజామోదం లభించేది.**

బ్యాంకు రుణాలు సహా అన్నిరకాల అనుమతులున్న ఇండ్లను ముట్టుకోకుండా ప్రత్యామ్నాయం ఆలోచిస్తే బాగుండేది. పరిపాలనలో ప్రాధాన్యాలు చాలా ఉంటాయి. అవి ఎంత గొప్పవైనా సామాన్య ప్రజల కనీస అవసరాల తర్వాతే. ప్రభుత్వం ప్రతిష్ఠకు పోకుండా ఇది ఇంతటితో ఆపి పరిష్కారం కోసం సవ్య దిశగా అడుగు వేస్తే మంచిది. న్యాయస్థానాల తలంట్లు సరిపోలేదా. ఇప్పటికైనా అన్ని రాజకీయపక్షాలతో సాంకేతిక నిపుణులతో, మేధావులతో ఒక సమావేశం ఏర్పాటుచేసి ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటే మంచిది. సర్వజనామోదానికి అదొక్కటే మార్గం. లేదంటే ప్రజాగ్రహం చవిచూడక తప్పదు. 1976లో ఎమర్జెన్సీ రోజుల్లో నాటి ప్రధాని గాంధీ, తనయుడు సంజయ్ గాంధీ ప్రేరేపణతో ఢిల్లీలోని తుర్క్‌మెన్ గేట్ ప్రాంతంలో మొగలుల కాలం నుంచి ఉంటున్న ప్రజల నివాసాలను బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టమూ జరిగింది. ఆ సంఘటన ప్రభావం 1977 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ సహా కాంగ్రెస్ ఘోర పరాజయానికి ఒక కారణమైంది. ఇప్పుడు హైదరాబాద్‌ను మరో తుర్క్‌మెన్ గేట్ చేయాలనుకుంటుందా ఈ ప్రభుత్వం?

**బతుకమ్మ అంటే నాకు పూల అమరిక అని ఎప్పుడూ అనిపించదు. ఎందుకంటే నాతో పాటే పుట్టి, పెరిగినట్టే ఉంటుంది. దసరా సెలవులకు నా మేనత్తల ఇంటికి పోయినా, పెద్దమ్మల ఇంటికి పోయినా, ఆఖరికి నాకు పెళ్లయినా.. నాతో పాటు అత్తింటికి వచ్చినట్టే అనిపిస్తుంది. మొత్తంగా బతుకమ్మ ఎప్పుడూ నాతోనే ఉన్న భావన. ఈ భావన నాకే కాదు, తెలంగాణలో పుట్టి పెరిగిన ప్రతి ఆడపడుచుకూ ఉంటుంది.**

# ఒక్కేసి పువ్వేసి చందమామ..



భోజన్నగారి అనసూయ



మాది సదాశివనగర్. నాన్న ఉద్యోగ రీత్యా రామారెడ్డిలో ఉండేవాళ్లం. సెలవులొస్తే చాలు సదాశివనగర్‌కు పోయేటోళ్లం. లేదా మా పెద్దమ్మ వాళ్ల ఊరు కామారెడ్డికి, లేకుంటే పెద్ద మేనత్త ఉండే అడ్లూర్ ఎల్లారెడ్డికి పోయేటోళ్లం. దసరా సెలవుల్లో పెదనాన్న, ముగ్గురు చిన్నాన్నల కుటుంబాలన్నీ ఒక్కగూటికి చేరేవాళ్లం. మేమంతా కలిస్తే ఇల్లంతా సందడే సందడి. మా ఊళ్లో మెయిన్ రోడ్డుకు సత్తే పీర్ దర్గా ఉంటది. ఆ మసీదు మొత్తం అల్లుకున్న జాజిపూల తీగ ఉంటుంది. అక్కడికిపోయి జాజిమొగ్గలు తెంపుకొచ్చిన రోజులు నేనింకా మర్చిపోలేదు.

బతుకమ్మ పేర్చేందుకు గునుగు, తంగేడు పూల కోసం పొలాలు, రోడ్ల వెంబడి తిరిగేవాళ్లం. పొద్దున్న నాలుగు గంటలకే పెదనాన్న స్నానం చేసి, పూజ ముగించుకొని బతుకమ్మ పేర్చడానికి సిద్ధమయ్యేవాడు. అందరం తలో చేయి వేసేవాళ్లం. పళ్లెంలో మొదట ఆంజేపుకాయ తీగ ఆకులను పెట్టి, ఆ తర్వాత రెండు వరుసలు గునుగు పూలు పేర్చి, మూడో వరుస తంగేడు పూలు పేర్చేది. అవి కదలకుండా ఉండేందుకు మధ్యలో తంగేడు, గునుగు ఆకులు పోసేది. దాన్ని పొట్ట నింపుడు, కడుపు నింపుడు అనేవాళ్లం. బతుకమ్మ పేర్చేటప్పుడు పెదనాన్న ఎన్నో విషయాలు చెప్పేవాడు. కానీ, మాకేమో బతుకమ్మ అయిపోంగనే పెరట్లోకి పోయి జామకాయలు తెంపుకొని తినుడుతోనే సరిపోయేది. సాయంత్రం బతుకమ్మ ఆడటానికి పోయేటప్పుడు పచ్చ గోర్మిటి (డిసెంబర్) పూలు పెట్టుకునేవాళ్లం.

ఇక సాయంత్రం మేం (పిల్లలు) మాత్రమే రోజు గుడి దగ్గరికి పోయేది. ఒక ఇత్తడి టిఫిన్ డబ్బాలో అటుకులు పోసి కొద్దిగ నెయ్యి, చెక్కర వేసి కలిపిస్తే రోజూ తీసుకుపోయేది. కనీ, మిగతా దోస్తులు తెచ్చుకున్న ఆహార పదార్థాలు నోరూరించేవి. బాల్యం కాబట్టి ప్రతి చిన్న విషయాన్ని తొందరగానే మరపులోకి నెట్టివేసేది. ఇప్పుడు కొంతమంది తప్ప, మిగతావారు మొదటి, చివరి బతుకమ్మ మాత్రమే పేరుస్తున్నారు. పెద్ద బతుకమ్మ ముందురోజు దాదాపు రాత్రి పన్నెండు వరకు ఇంట్లో అందరం కూర్చొని రెండు మూడడుగుల బతుకమ్మ పేర్చేవాళ్లం. చివరికి శిఖరం పెట్టి, తాళ్లతో కట్టి దేవుడి గది ముందు అలికి, ముగ్గేసి అక్కడ బతుకమ్మను పెట్టి నిద్ర పోయేవాళ్లం. తెల్లారి ఇంకో చిన్న బతుకమ్మ పేర్చేవాళ్లం. సాయంత్రం మళ్లీ పసుపు, కుంకుమ వేసి రెండు బతుకమ్మలను పెద్ద వాకిట్లో పెట్టి ఆడి, పాడి తర్వాత గుడి దగ్గరికి తీసుకుపోయేవాళ్లం. తర్వాత అర్ధరాత్రి వరకు పాటలు పాడేవాళ్లం.

ఇక పాటల విషయానికి వస్తే మా ఇంటి చుట్టుముట్టు ఉన్న అమ్మలక్కలు ఒక్కో పాట గంటన్నర అయినా ఆపకుండా, దమ్ము తీయకుండా పాడేవాళ్లు. చప్పట్ల మధ్య లయబద్ధంగా ఆ పాటలు సాగేవి. అర్ధరాత్రి దాకా బతుకమ్మ ఆడిన తర్వాత అందరం కలిసి కాలువలు, చెరువుల్లో ఆ బతుకమ్మలను 'పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మళ్లొచ్చే ఏడాదికి మళ్లీ రావమ్మా' అంటూ సాగనంపేది. ఇప్పుడైతే ఎవరి సంఘాలు లేదా గుళ్లు, కమ్యూనిటీ హాళ్ల దగ్గరే పెద్ద నీటి కొలనులను ఏర్పాటు చేసుకొని అక్కడే ఆటపాటలతో గౌరమ్మను సాగనంపుతున్నరు. మా చిన్నతనంలో అలా కాదు. అందరం పసుపు, కుంకుమలు 'ఇచ్చుకోవమ్మ వాయినం, పుచ్చుకోవమ్మ వాయినం' అంటూ పరస్పరం స్వీకరించి, తెచ్చుకున్న పిండివంటలు ఒకరికొకరు రుచి చూపించేవాళ్లం. మళ్లీ ఇంటికి చేరుకున్నాక ఆడవాళ్లు ఖాళీ తాంబాళాలతో బతుకమ్మ ఆడేవాళ్లం. బతుకమ్మ పాటలు ఎంత అర్థవంతంగా ఉంటాయో తెలంగాణలోని ప్రతి ఆడబిడ్డకు తెలిసిన విషయమే.

ఆ పాటల్లో నాకే కాదు, అందరికీ చటుక్కున గుర్తొచ్చేది 'ఇద్దరక్క చెల్లెళ్లు ఉయ్యాలో' పాటనే. నాకు బాగా నచ్చిన పాట, నేను మా గల్లీలో తప్పక పాడే పాట...

> **'ఆకాశాన పొయ్యేటి ఉయ్యాలో**
> **అడవి పక్షుల్లారా ఉయ్యాలో**
> **ఆకలాయెనే హంస ఉయ్యాలో**
> **దూపలాయెనే హంస ఉయ్యాలో..'**

ఈ పాట ఎందుకో నాకే కాదు, చాలామంది తెలంగాణ ఆడపడచుల జీవితాలకు దగ్గరగా ఉందని నా ప్రగాఢమైన నమ్మకం.

**(నేడు ఎంగిలిపూల బతుకమ్మ)**